


అమ్మ ఆ మాట చెప్తే విని ఆశ్చర్యపోయాను - "సూరిబాబు కనపడటం లేదని వాళ్ళింట్లో వాళ్ళు వెతుక్కుంటున్నారట! సూరిగాడితో బాటుగా దుకాణంలోంచి డబ్బూ దస్కం కూడా బాగానే పోయినట్లున్నాయి! కోదండరామయ్య ఒకటే గగ్గోలు పెటేస్తున్నాడు" అంటూ అమ్మ అనటం కూడా విన్నాను నేను!

'అంటే ఆ వెధవే డబ్బు తీసుకుని పారిపోయాడన్నమాట!' అన్నారు నాన్నగారు.

వంటింట్లో పొయ్యిముందు కూర్చుని అమ్మ దోసెలు వేస్తోంది. ఆరగిస్తున్నాం. మా ఇంట్లో అదో ముచ్చటైన సీను. వేడివేడి దోసెల్ని అలా పెనంమీంచి తీసి ఇలా మా పళ్ళాల్లో వేస్తోంటే, వాటిని ఆవకాయతోనో మరేదో పచ్చడితోనో నంజుకొని తింటూ లోకాభిరామాయణం ముచ్చటించుకోవటం పరిపాటి. ఇరుగుపొరుగు అమ్మలక్కల దగ్గర కిందటి రోజు పోగుచేసిన సమాచారాన్ని అంతా అక్కడే మా నాన్నగారి చెవిన వేస్తుంటుంది మా అమ్మ. వినాల్సిన వన్నీ వింటూ, అపుడపుడు నేనూ ఏదో ఓ వ్యాఖ్యానం చేస్తే నీకెందుకురా ఈ ఆరిందా కబుర్లు అంటూ దోసెలతో బాటు అమ్మపెట్టే చివాట్లు తినటమూ నాకు అలవాటే. ఈ రోజూ మా ఇంట అదే కార్యక్రమం షరాతప్పక కొనసాగుతోంది.

ఈ వేళ వార్తా ప్రసారంలో ముఖ్యమైన అంశం అదే అయింది.

సూరిబాబు గురించి, కోదండరామయ్య గురించి అమ్మ వాళ్ళింకా మాట్లాడుకొంటూనే ఉన్నారు. నాకు వారి మాటలు వినబడటం లేదు. నాకు వినిపిస్తున్నదల్లా గల్లా పెట్టెలోంచి గలగలలాడే కానుక శబ్దమే.

సూరిబాబు ఎత్తైన ఓ కుర్చీలో కూర్చునేవాడు అతని ముందు షోకేస్. అందులోపల

లేటెస్ట్‌గా వచ్చిన సబ్బులు, దువ్వెనలు, షాంపులు, పెన్నులు, పుస్తకాలు వగైరాలన్నీ ఉండేవి. షోకేస్‌లో ఉండే గల్లా పెట్టెలో నాలుగు గ్లాసులుండేవి. ఒక గ్లాసులో రూపాయికానులు, రెండో దాంట్లో అర్ధరూపాయలు, మూడోదాంట్లో పావలాలు, నాలుగోదాంట్లో ఇతర చిల్లర నాణేలు, వాటనందూ కూర్చుని సూరిబాబు ఒక క్లాసులోని నాణాన్ని పైకి తీసి ఆ గ్లాసులోకి దారగా వదిలేవాడు ఆ నాణాలన్నీ గలగల గ్లాసులోకి రాలుతూ వింత శబ్దం చేసేవి.

ఎంత బాగుండేదని ఆ శబ్దం.

ప్రపంచంలోని డబ్బునంతా తన చేతుల్లో పెట్టుకొని తను చెప్పినట్లుగా ఆ డబ్బును ఆడించగలుగుతున్నట్లుగా కనిపించేవాడు సూరిబాబు నా కళ్ళకు.

సూరిబాబును చూస్తే నాకెంతో ఈర్ష్యగా ఉండేది. వాడూ నా ఈడువాడే.

అయితేనేం, వాడికి అన్నీ చేతికందే చేరువలోనే ఉండేవి. డబ్బులయితే గల్లా పెట్టెనిండుగా చాక్లెట్లయితే పక్కనే ఎన్నో సీసాలనిండుగా, బిళ్ళలూ, బిస్కట్లు, బలపాలు, పలకలూ, పెన్నులు, పుస్తకాలు అన్నీ వాడిదగ్గరే.

నాకయితే ఓ చాక్లెట్ కొనుక్కోవాలంటే అమ్మదగ్గర అరగంట మారాం చేయాలి. బిస్కెట్ పాకెట్ కావాలంటే నాన్నగారిముందు గంటసేపు పాఠాలు చదవాల్సి వచ్చేది.

సూరిబాబుకు అదేమీలేదు. 'దుకాణంలో కూర్చోరా అబ్బాయ్' అంటూ కోదండరామయ్య వెళ్ళిపోయాడు. ఇక సామ్రాజ్యమంతా వాడిదే.

మా నాన్నగారు కూడా కోదండ రామయ్యలాగే ఓ కిరాణా కొట్టు పెట్టిఉంటే ఎంత బాగుండేదో.

నన్ను కూడా గల్లాపెట్టెలోంచి డబ్బుల్ని అలా జారవిడుస్తూ ఆ గలగల శబ్దాల వింటుంటే ఎంత బాగుండేదో.



ఆ అదృష్టం ఈ జన్మకులేదు... నాకే కాదు, నాతో బాటు మా స్కూలు ముందుండే కానుగ చెట్లెక్కి కోతికొమ్మచ్చి ఆటలాడే మా దోస్తులెవరికీ ఆ అదృష్టంలేదు.

'సూరిగాడికే హాయి కదరా.. షాపులో ఏదైనా తీసుకోవచ్చు' అని ఒకడంటే, 'డబ్బు కూడా వాడిదేరా' అనేవాడు ఇంకోడు.

కానీ సూరిబాబు ఎందుకిలా పారిపోయినట్లు. అర్థంకాని చిక్కు ప్రశ్న అది.

ఆ ప్రశ్నకు సమాధానం దొరుకుతుందేమోనని, ఇంట్లోంచి బయటకు నడిచి తిన్నగా కోదండరామయ్య కిరాణా దుకాణానికి వెళ్ళాను. దుకాణం ముందు

చాలామంది గుమిగూడి ఉన్నారు. సూరిబాబు నిన్న మధ్యాహ్నం నుంచీ కనబడటం లేదు. డబ్బు కూడా చాలానే తీసుకెళ్ళిపోయాడట...

'డబ్బుపోతే పోయింది. బిడ్డ దొరికితే చాల'ంటున్నాడు కోదండరామయ్య.

'ఎక్కడికి పోతాడు లేవయ్యా. చేతిలో తైలం అయిపోగానే, తిరిగి వాడే వచ్చేస్తాడు. ఎన్ని చూళ్ళేదు మనం, నువ్వే చెప్పు' అంటున్నాడు ఇంకొకరు ఓదార్పుగా.

'కోదండం, నామాట విను, పోలీసు స్టేషనుకు వెళ్ళి రిపోర్టియ్యి, పైగా చేతిలో వేల డబ్బున్నవాడు. పాడులోకం! ఎన్నెన్ని పాడుకథలు విన్నామో మనం.. జాగ్రత్తపడటం మంచిది. డబ్బు పోయినా కుర్రాడు దక్కుతాడు' అంటూ సలహా ఇస్తున్నారెవరో.

షాపులో తొంగి చూసాను– లోపలంతా ఖాళీగా ఉంది, బోసిగా ఉంది.

ఎప్పుడూ లోపల జనంతో కిటకిటలాడే షాపు నేడు ఖాళీగా ఉంది. షోకేసూ, గల్లా పెట్టె, అందులోని గ్లాసులు అన్నీ అలాగే నిశ్శబ్దంగా ఉన్నాయి.

అక్కడ ఇంకా సూరిబాబు ఉన్నట్లే అనిపిస్తోంది. నాకు కాసుల గలగలలు మాత్రం వినపట్టం లేదు.

మనసంతా కలతబారి పోయింది. ఏదో తెలీని లోటుగా అనిపించింది నాకు. భారంగా ఇంటికి నడిచాను నేను.

వారం, పదిరోజులు గడిచాయి.

కోదండరామయ్య దుకాణం మూతపడిపోయింది. కొడుకుకోసం ఆయన అన్వేషణలో పడ్డాడు. 'ఎంత వెతికినా దొరకటంలేదట' అని అమ్మ అంటే, 'అంత డబ్బుతో ఆ వెధవ వెళ్తే ఏముంది, ఎవరో ఆ డబ్బు దోచుకొని వాణ్ణేదో చేసి ఉంటారు' అన్నారు నాన్నగారు.

ఆ తర్వాత మా మాటల్లోంచి సూరిబాబు క్రమంగా జారిపోయాడు. కోదండరామయ్య దుకాణం మూసేసుకొని వెళ్ళిపోయాడన్న సంగతితో ఆ కుటుంబమూ మా చర్చల్లోంచి తప్పుకొంది.

ఎప్పుడైనా బజారుకు వెళ్ళినప్పుడు, ఆ కోదండరామయ్య దుకాణంకేసి చూసినప్పుడు మాత్రం నాకు సూరిబాబు గుర్తొచ్చేవాడు. అంత డబ్బు తీసుకొని వెళ్ళిపోయిన సూరిబాబు ఎంత సరదాగా ఉంటున్నాడో, అనుకొనేవాడిని..

పది, పన్నెండేళ్లు గడిచాయి.

నాకిప్పుడు ఓ బ్యాంకులో ఉద్యోగం ఉంది. బాంకు బాలెన్సు ఉంది. భార్యగా శోభ నా జీవితంలోకి వచ్చింది. మేం ఇద్దరం, మాకిద్దరు అనే నినాదానికి ప్రతీకగా ఉంటున్నాం.

ట్రాన్స్‌ఫర్ మీద ఆ ఊరొచ్చాను నేను. చిన్న ఊరైనా అన్నీ సౌకర్యంగానే ఉన్నాయి. మరీ పట్నం అంతటి విలాసాలు లేవేమోగాని, అంతా హేపీగానే ఉంది.

ఆ రోజు బ్యాంకులో పనిచేసుకొంటూంటే వచ్చాడతను, "నా పేరు సూర్యనారాయణండి. బ్యాంకులో లోన్ తీసుకోవాలనుకొంటున్నా.. మీరేమైనా సాయం చేస్తే.."

ఆగిపోయాడతను. అతనికేసి చూశాను. సూర్యనారాయణ కాదతను, నా సూరిబాబే! అతను నన్ను గుర్తుపట్టలేదు. నేనూ గుర్తుపట్టనట్లే ఉండిపోయాను.

ఏవేవో ప్రశ్నలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. ఎన్నాళ్ళనుంచో జవాబు దొరకని ప్రశ్నలకు జవాబు చెప్పగల వ్యక్తి ఎదురుగానే ఉన్నాడు. ఆ ప్రశ్నలన్నిటినీ ఒకేసారి అడగాలనే ఆకాంక్ష.

"చెప్పండి, ఇపుడు మీరేం చేస్తున్నారు" అంటూ వృత్తిధర్మంతో అడిగాను.

పెద్దమార్కెట్‌లో చిన్న కిరాణా కొట్టుందిట. దాన్ని కొంచెం ఇంప్రూవ్ చేసుకోవటానికేనట ఈ లోన్ అభ్యర్థన! రుణం ఇప్పిస్తే మీ పేరు చెప్పుకొని దీపం పెట్టుకొంటాననంటున్నాడు సూరిబాబు.

ఆ మనిషెంతగా మారిపోయాడోనన్నదే నేను ఆలోచిస్తున్నాను. చిన్నప్పుడు చిన్న నిక్కరుతో, షాపంతా తనే అయి తిరుగుతూ, కుర్చనిచ్చెన పైకెక్కి పైనుంచి అలమార్లలోంచి ఏ హార్లిక్స్ సీసానో అందుకుంటూనో... త్రాసులో బియ్యంపోసి తూస్తూనో, గ్లాసులో చిల్లర అలా ధారగా జారవిడుస్తూనో...

ఇప్పుడు ప్యాంటూ, షర్టూ వేశాడు. మనిషిలో హుందాతనం వచ్చింది. కానీ, బీదరికం ఛాయలు కనిపిస్తూనే ఉన్నాయి.

"సాయంత్రం ఓసారి మీ షాపు చూస్తాను. దాన్నిబట్టి లోనెంత కావాల్సి ఉంటుందో, ఎంత ఇవ్వగలుగుతామో ఆలోచించి అప్లికేషన్ పెడుదురుగాని" అన్నాను నేను.

సూర్యనారాయణ వెళ్ళిపోతోంటే 'కోదండరామయ్య ఎలా ఉన్నారు' అని అడగబోయి తమాయించుకొన్నాను. సాయంత్రం ఎలాగూ సూరిబాబు షాపు సందర్శనం ఉండనే ఉంది. తినబోతూ రుచి చూడటమెందుకూ!

సాయంత్రం పెద్దమార్కెట్‌లో ఆ చిన్నషాపుకు వెళ్లాను. దాన్ని చూస్తే, నాకు కోదండరామయ్య కిరాణా దుకాణం చూస్తున్నట్టే ఉంది. ఎటొచ్చీ కొంత మోడర్నిటితో, షోకేసు, గల్లాపెట్టె, లోపల గ్లాసులు, గ్లాసులో నాణాలు... వర్తమానంలో గతాన్ని చూస్తున్నాను నేను....

మాట్లాడాల్సినవన్నీ మాట్లాడాను. ఆ తర్వాత ఉన్నట్లుండి అడిగాను. "నన్నింకా గుర్తుపట్టలేదా సూరిబాబూ!" అని.

సూర్యనారాయణ, అదే సూరిబాబు ఉలిక్కిపడ్డాడు.

"మీరు..." అంటూ ఆగిపోయాడు. గుర్తుచేశాను నేనెవర్నో.

కావలించుకొన్నంత పని చేశాడు సంతోషంతో. లోపల్నించి పెళ్ళాన్నీ, కొడుకును పిల్చి పరిచయం చేశాడు. సూరిబాబు భార్య ధనలక్ష్మి 'నమస్కారం' అని క్షణం తర్వాత లోపలికి వెళ్ళిపోయింది. కొడుకు రామం... బహుశ కోదండరామయ్య ఏమో... వెళ్ళి గల్లా పెట్టెముందు కూర్చున్నాడు.

"ఎందుకలా చేశావ్..." అనడిగాను నవ్వుతూ...

ఎప్పటిదో గతం అది. ఇప్పుడు వెనుదిరిగి చూసుకొని నవ్వుకోగల స్థితిలో ఉన్నాం, ఆ గతాన్ని ఏ ఎమోషనూ లేకుండా గుర్తు చేసుకోగల స్థితిలోనూ ఉన్నాం...

"ఏది... అప్పుడా..." అన్నాడు సూరిబాబు గతాన్ని తల్చుకొంటూ.

"అదంతా ఓ పీడకలలా అయిపోయిందండీ, పుట్టీ పుట్టకముందునుంచే నన్ను ఆ దుకాణంలో పడేశాడు మా నాన్న! ఎంతసేపూ సరుకులూ, రొక్కాలూ, వెచ్చాలూ, పద్దులూ తప్పిస్తే ఇంకో ప్రపంచం ఉండేదికాదు నాకు! రోజంతా స్కూలుకు వెళ్ళి సాయంత్రాలపూట సరదాగా ఆడుకొనే మిమ్మల్నంతా చూస్తే నాకెంతో అసూయగా ఉండేది. అలాటి స్వేచ్ఛ నాకు లేదని బాధపడేవాడ్ని. అందుకే అవకాశం చూసుకొని..."

సూరిబాబు ఇంకా ఏదో చెప్తూనే ఉన్నాడు. నేనది వినటంలేదు. జీవితం ఎంత చిత్రంగా ఉంటుందో గదా– నేను, సూరిబాబును చూసి ఈర్ష్య పడేవాణ్ణి. అతను నన్ను చూసి అసూయ పడేవాడట!

"... అలా వెళ్ళిపోయిన వాణ్ణి, ఇదుగో ఈ ఊళ్ళో ఇలా చేరాను. చేతిలోని డబ్బంతా అయిపోయాక అర్థం అయింది నాకు ఎంత తప్పు చేశానో... అంత డబ్బుతో పారిపోయిన వాణ్ణి తిరిగి ఇంటిముఖం పట్టలేకపోయాను. అమ్మానాన్నా అందరూ గుర్తొచ్చినా ఇక్కడే ఉండిపోయాను... మా నాన్న నాకోసం ఎక్కడెక్కడో వెతికి ఉంటాడు. మా అమ్మ నాకోసం ఎంతో బెంగపెట్టుకొని ఉంటుంది... అంతా తెలిసినా, మళ్ళీ వాళ్ళకు నా ముఖం చూపించలేకపోయాను. జీవితాన్ని చిందరవందర చేసుకొన్న పాపిష్టిబతుకు నాది. చివరకు, ఈ ఊళ్ళోనే ఓ కిరాణా కొట్లో పనికి చేరాను. వెచ్చాల పొట్లాలు కట్టటం తప్ప ఇంకేమీ రానివాడ్ని! ఈ సరుకుల మధ్య సమాధి కావాలి తప్ప నాకు వేరే మార్గం లేదని అర్థమయింది..."

సూరిబాబు కళ్ళలో నీళ్ళు..

స్వేచ్ఛకోసం గూడొదిలి పారిపోయాడు ఓనాడు. స్వేచ్ఛ అనేది లేనే లేదని అంటున్నాడు నేడు.

గల్లాపెట్టెముందు ఎత్తైన కుర్చీలో కూర్చుని సూరిబాబు కొడుకు రామం. గల్లా పెట్టె గ్లాసుల్లోని నాణాల చప్పుడు నాకు సంకెళ్ళ చప్పుడులా వినిపిస్తోంది.

'గతంలో సూరిబాబు, వర్తమానంలో రామం అవుతాడా!' ఆ ఆలోచన నన్నొకసారి భయపెట్టింది. కంగారుగా ఆ కిరాణా కొట్టులోంచి బయటకు నడిచాను. ఆ కొట్లోంచి నాణాల సంకెళ్ళ చప్పుడు నన్నింకా వెంబడిస్తూనే ఉంది...

– ఈనాడు ఆదివారం సంచిక